క్లుప్తంగా

రోడ్డును శుభ్రం చేయించిన అధికారులు



రొద్దం వైఎస్సార్ సర్కిల్ వద్ద శుభ్రం చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పేరుకు పోయిన వర్షపు నీరు, బురదపై 'చినుకు పడితే చిత్తడే' అన్న శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైయింది. ఈ కథనానికి స్పందించిన ఈఓఆర్డీ గోవిందప్ప సోమవారం పావగడ - పెనుకొండ ప్రధాన రహదారి వైఎస్సార్ సర్కిల్ వద్ద పేరుకు పోయిన బురదతో పాటు డ్రైనేజీని శుభ్రం చేయించి, బ్లీచింగ్ వేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రెడ్ రిబ్బన్ జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన ఎస్.శబరీన్‌తాజ్, ఎస్.నిజాముద్దీన్ జిల్లా స్థాయిలో రెండోస్థానంలో గెలుపొందారు. వీరికి నగదు బహుమతిగా రూ.4 వేలను జిల్లా రెడ్ రిబ్బన్ ప్రతినిధి మునిరత్నం, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి చెన్నకేశవప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు ఈనెల 26న రాష్ట్రస్థాయిలో జరిగే క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుదర్శన్, రెడ్‌రిబ్బన్ నోడల్ అధికారి జయప్రకాష్ కళాశాల సిబ్బంది అభినందించారు.

విషపూరితమైన టమాటాలు తిని కోళ్లు మృతి



చనిపోయిన కోడి పుంజులు

పావగడ: టమాట పంటకు ప్రబలిన మచ్చల తెగుళ్లు నివారించడానికి మందు పిచికారీ చేసిన టమాటాలను తిని 40 నాటు కోళ్లు చనిపోయిన సంఘటన తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి తిప్పయ్యనదుర్గ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తిప్పయ్యనదుర్గ గ్రామం శివారులో 5 ఎకరాల భూమిలో జానకీరామ్ అనే రైతు ఫారం కోళ్ల షెడ్డు, నాటు కోళ్ల పెంపకంతో పాటు టమాటా పంటను సాగు చేశారు. పంటకు మచ్చ తెగులు సోకడంతో రసాయన మందులు కొట్టారు. కొద్ది సేపటికే సుమారు 40 నాటు కోడి పుంజులు టమాటాలు తిని అక్కడికక్కడే చనిపోయాయి. సుమారు రూ 2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు జానకీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కంపెనీనే బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం అధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేశారు.

వివిధ సమస్యలపై 15 అర్జీలు

పెనుకొండ రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్‌స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ 15 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.

చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు తిప్పమ్మ. పెనుకొండ మండలం గొళ్లపల్లికి చెందిన తిప్పమ్మ గత నాలుగేళ్లగా పక్షవాతంతో బాధపడుతోంది. కుడి కాలు, కుడి చెయ్యి పూర్తిగా పని చేయడం లేదు. దీంతో నాలుగేళ్ల నుంచి మంచం మీదనే విశ్రాంతి తీసుకొంటోంది. సొంతంగా ఏ పని చేసుకోలేని తనకు 40 శాతం వైకల్యం ఉన్నప్పటికీ పింఛన్ తొలగించారని తిప్పమ్మ కంటతడి పెడుతోంది. తన పరిస్థితిని చూసైనా అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని వేడుకుంటోంది.



గొళ్లపల్లి గ్రామంలో మంచానికే పరిమితమైన తిప్పమ్మ

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రంగారెడ్డి. వీరిది పెనుకొండ మండలం గొళ్లపల్లి.రంగారెడ్డి చిన్నతనంలోనే ప్రమాదవశాత్తూ కన్ను పోయింది. అప్పటి నుంచి ఒక కంటితోనే జీవనం సాగిస్తున్నారు. 2014లో అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంనే వికలాంగుడిగా సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అప్పటి నుంచి రంగారెడ్డికి క్రమం తప్పకుండా ప్రభుత్వాలు ఫించన్ అందించాయి. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ఎలాంటి కారణం చూపకుండానే పింఛన్ తొలగింపు లిస్టులో రంగారెడ్డి పేరును చేర్చేసింది. ఎన్నో ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నానని, ఉన్న ఫలంగా తనలాంటి పేదలకు అన్యాయం చేయడం భావ్యం కాదని రంగారెడ్డి వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే వికలాంగుడిగా గుర్తించారని, అదే ప్రభుత్వం ఇప్పుడు తన పింఛన్‌ను తొలగిస్తుండటం దారుణమంటున్నారు.



శాశ్వతంగా కన్ను కోల్పోయిన రంగారెడ్డి

మంత్రి సవిత ఇలాకాలో.. ఏడి పింఛన్



పెనుకొండలో తొలగించిన పింఛన్లు	
మండలం	తొలగించిన పింఛన్ల సంఖ్య
పెనుకొండ	193
సోమందేపలి	126
పరిగి	129
రొద్దం	115
గోరంట్ల	210

- పెనుకొండ నియోజకవర్గంలో 773 పింఛన్ల తొలగింపు
- లబోదిబోమంటున్న దివ్యాంగులు

పెనుకొండ రూరల్: 'నూతన పింఛన్లు అందిస్తాం. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారికి 50 ఏళ్లు దాటితే చాలు పింఛన్ ఇచ్చి భరోసా ఇస్తాం' అంటూ ఎన్నికలకు ముందు హామీలు గుప్పించారు కూటమి నేతలు. అయితే అధికారం చేపట్టిన తర్వాత నూతన పింఛన్ల సంగతి అటుంచితే ఉన్న పింఛన్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ప్రతి నెలా కొందరి పేర్లను మాయం చేస్తూనే ఉన్నారు. తాజాగా నిబంధనల పేరుతో దివ్యాంగుల పింఛన్లకు ఎసరు పెట్టారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న వారికి ఉన్న ఫలంగా నోటీసులు జారీ చేయడంతో పింఛన్‌దారులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నిబంధనల పేరుతో అన్యాయం

వికలాంగుల ఫించన్లపై కూటమి ప్రభుత్వం కుట్ర చేసింది. వికలాంగత్వం 40 శాతం ఉన్నప్పటికీ అంతకు పైబడి ఉండాలన్న నిబంధనలతో పింఛన్ల తొలగింపు మొదలు పెట్టింది. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఇలాకాలో మొత్తం 773 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించారు. నోటీసులు అందుకున్నప్పటి నుంచి వారంతా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పింఛన్ తొలగించొద్దని వేడుకుంటున్నారు. ఉన్న పింఛన్ తీసేస్తే తాము బతికేది ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు న్యాయం చేసేలా చర్యలు



రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల పింఛన్‌దారులందరి పింఛన్ల రీవెరిఫికేషన్ జరుగుతోంది. ఇందులో భాగంగానే వెరిఫికేషన్‌లో కొందరు దివ్యాంగుల పింఛన్లను తొలగించారు. అయితే అర్హత ఉండి పింఛన్ తొలగింపు లిస్టులో ఉన్న వారికి న్యాయం చేసేలా చర్యలు చేపట్టాము. ఇప్పటికే ఎంపీడీఓల లాగిన్ ద్వారా అర్జీలు స్వీకరిస్తున్నాం. మళ్లీ సదరం క్యాంపులు నిర్వహించి అర్హులందరికీ కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాము.

– ఆనంద్‌కుమార్, ఆర్డీఓ

పింఛన్లు తొలగించడం అన్యాయం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన దివ్యాంగులు

అగళి: కూటమి ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ అన్నారు. పింఛన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి నోటీసులు అందుకున్న దివ్యాంగులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. స్టూడియో శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఉన్న సదరం సర్టిఫికెట్లను కాదని ప్రత్యేక బృందాల ద్వారా పునఃపరిశీలన పేరుతో వైకల్య శాతం తక్కువ చూపుతూ పింఛను తొలగిస్తుండటం అన్యాయమన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పరిగి: మండలానికి ఉన్న ప్రత్యేకత ఆధారంగా గతంలో ఎన్నడూ లేని విధంగా వినాయక నిమజ్జనోత్సవాన్ని నిర్వహించాలని అధికారులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ హసీనాసుల్తానా అధ్యక్షతన ఎస్‌ఐ రంగడూయాదవ్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవ మండల శాంతి కమిటీ సమావేశం జరిగింది. వినాయక విగ్రహాల ఏర్పాటు దశ నుంచి నిమజ్జనం ప్రక్రియ వరకూ గ్రామస్థాయిలోని పెద్ద మనుషులు, ఆయా రాజకీయ పార్టీల నేతల సహకారంతో నిర్వహించాలని అధికారులు కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించాలి



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న దృశ్యం

పరిగి: గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం ఒత్తిడిని తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. సోమవారం వివిధ సమస్యలపై ఎంపీడీఓ రెడ్డెప్పకు వినతిపత్రాన్ని అందించారు. రోజూ ఉదయం 6 గంటలకే పారిశుధ్య పనుల పర్యవేక్షణకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయమనడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ శివానంద్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో గుడిబండ పీహెచ్‌సీ డాక్టర్ శివానంద్, మలేరియ సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి జ్వరం, దగ్గు వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించారు. ప్రిన్సిపల్ మైలారప్ప, హెల్త్ అసిస్టెంట్లు వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. 14 నెలల కూటమి పాలన నచ్చక పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. పట్టణంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో అమరాపురం మండలం ఆలదపల్లికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సాన్‌సీపీలో చేరారు. ముకుందప్ప, చిక్కన్న తదితర టీడీపీ కార్యకర్తలు తమ అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు పాలన నచ్చక టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



గుడిబండ: తనిఖీల్లో పాల్గొన్న విజిలెన్స్ అధికారులు

అమరాపురం/గుడిబండ/లేపాక్షి: అమరాపురం, గుడిబండ, లేపాక్షి మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, పురుగు మందు నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో అమరాపురం తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎస్‌ఐ విశాఖ్‌బాషా, లేపాక్షి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఏఓ శ్రీలత, ఏఎస్‌ఐ షర్ఫుద్దీన్, గుడిబండ ఏఓ వీరనరేష్, తహసీల్దార్ శ్రీధర్, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప, కమర్షియల్ ట్యాక్స్ అధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

సోమందేపల్లి: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని చాలకూరు, మేకలపల్లి, చల్లాప్లి సోమందేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, టీఏ బకాయిలు చెల్లించి అసెస్మెంట్ బుక్‌వర్క్ తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

హిందూపురం: ఆటోలను నమ్ముకుని ఏళ్ల తరబడిగా అతి తక్కువ ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్న ఆటో కార్మికుల జీవనాధారం కోల్పోయేలా ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడం సబబుకాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాములు అన్నారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హిందూపురం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ పట్టణ కోకన్వీనర్ రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు బాబురెడ్డి, సూరి, వలి, అంజనప్ప, గురు, కొట్నూర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలి

అగళి: 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేపట్టాలని తహసీల్దార్ సుబ్బరావు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బరావు మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈ నెల 30వ తేదీలోపు సరుకులు పంపిణీ చేయాలన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

రొద్దం: మల్బరీ సాగులో రైతులు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశ్రమ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రమ్య తెలిపారు. సోమవారం మండలంలోని బీదానిపల్లిలో నా పట్టు–నా అభిమానం అనే కార్యక్రమంలో భాగంగా మల్బరీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, డాక్టర్ మురళీ హాజరై మాట్లాడారు. భూసార పరీక్షలు నిర్వహించాలని, మొక్కల మధ్య దూరం ఉండేలా చూడాలన్నారు. నాణ్యత, అధిక దిగుబడి కోసం రైతులు ప్రయత్నించాలన్నారు. పట్టు పురుగుల పెంపకంలో ఉష్ణోగ్రత, తేమ నియంత్రణ కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రైతులు సమయానికి జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఓబులేసు, ఏడీ రత్నం, సర్పంచ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీని పరామర్శించిన సజ్జల, పెద్దిరెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ద్వారా సమాచారం తెలుసుకున్న వారు వేర్వేరుగా ఫోన్ ద్వారా పరామర్శించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కూటమి మోసాలను ఎండగడదాం



హొట్టేబెట్టలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో అధికార దాహం కోసం ప్రజలను మభ్య పెట్టి అమలు కాని సూపర్ సిక్స్ హామీలను ఇచ్చి, అమలు చేయని కూటమి ప్రభుత్వ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్ ప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం'గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 'రచ్చబండ' కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసింహారెడ్డి, ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి పార్టీలో సముచిత న్యాయం కల్పిస్తామన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

పావగడ: తాలూకాలోని గంగ సాగర గ్రామం ఇందిరాగాంధీ వసతి పాఠశాలలో సోమవారం నిర్వహించిన పావగడ తాలూకా చిన్నారుల శరణ సాహిత్య సమ్మేళనం కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అంతకు ముందు వివిధ వేషధారణలతో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. శివమొగ్గ జిల్లా చన్నగిరి తాలూకాకు చెందిన డాక్టర్ ఇంచర , ఎంజీ సిద్ధరామయ్య, అంతరగంగ శంకరప్ప, ప్రిన్సిపాల్ సోమశేఖర్, బీఈఓ రేణుకమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

సోమందేపల్లి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు హరి దాస్ తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15న జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆయన సొంత ఖర్చులతో బహుమతులు సోమవారం ప్రదానం చేశారు. హెచ్ఎం జబీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాయ్ హాయ్ గణేశా



ముస్తాబైన బాలగణపతి



వివిధ ప్రాంతాలకు తరలించడానికి సిద్ధం ఉంచిన వినాయక విగ్రహాలు

హిందూపురం: వినాయక చవితి సందడి మొదలైంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో స్వామివారిని కొలువు దీర్చే మంటపాలను సిద్ధం చేశారు. విగ్రహాల తరలింపు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. విఘ్నాధిపతిని ఆహ్వానించేందుకు కావాల్సిన వస్తువులను సైతం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మట్టి గణపతే .. మహాగణపతి అంటూ అధికారులు, సామాజిక సేవా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టాఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందని చెబుతున్నారు. హిందూపురంతో పాటు పలు చోట్ల మట్టి గణపతులను కొలువుదీర్చేందుకు ఏర్పాటు చేశారు.



రంగులు వేయడానికి సిద్ధంగా ఉంచిన వివిధ ఆకృతుల విగ్రహాలు



హిందూపురంలో రూపుదిద్దుకుంటున్న భారీ మట్టి గణపతి


మట్టి గణపతిని పూజించండి



సహజసిద్ధమైన బంకమట్టితోనే తయారు చేసిన వినాయక మూర్తులే పూజనీయం. గజముఖుడు నిండుగా అభయం ఇస్తున్నట్లున్న ఆకృతుల్లో పూజించాలి. ఇష్టానుసరంగా వివిధ ఆకృతులతో గణపతి ప్రతిమలు తయారుచేసి పూజించడం మంచిది కాదు. నీటిలో కరిగిపోయేలా సహజమైన రంగులతో భక్తిభావం నింపేలా ఉండాలి. అందరూ మట్టి వినాయక ప్రతిమలతో పూజలు చేయాలి.

– గోవిందశర్మ, హిందూపురం

భగవంతుని పూజకు భక్తి ప్రదానం



భక్తి లేకుండా బంగారు విగ్రహాన్ని పూజించినా ఫలితం ఉండదు. ప్రతి ఒక్కరూ త్రికరణ శుద్ధితో భక్తిశ్రద్ధలతో చిన్నమట్టి వినాయకుని పూజించినా ఎంతో ఫలితం ఉంటుంది. అంతేగాని పెద్ద విగ్రహాలను వికృత ఆకారాలతో ఆర్భాటాలతో పూజలు చేస్తే ఏం ప్రయోనం లేదు. ప్రకృతిని దైవంగా భావిస్తూ మట్టి గణపతి పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలి.

– సునిల్‌స్వామి, హిందూపురం

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పెనుకొండ: పట్టణంలోని పసరక్కర బావి దగ్గర ఉన్న గణేష్ ఆలయంలో సోమవారం వినాయక విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ప్రసాద్ స్వామి, శ్రీనివాసులు, జ్యోతి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పూర్ణకుంభాలతో వినాయకునికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.